# వేదార్థ మీమాంస

(శ్రుత్యర్థ పర్యాలోచన)

**కొత్త సచ్చిదానంద మూర్తి**

తెలుగుసేత

వాడ్రేవు చినవీరభద్రుడు

ఎమెస్కో

# విషయసూచిక


తొలిమాట 13

మొదటి అధ్యాయం

**వేద వాఙ్మయాన్ని అర్థం చేసుకోవలసిన పద్ధతి**

1. వేదం స్వభావం, అందులో ఉన్న విషయం 21
2. వేదార్థం తెలియడం అవసరం 27
3. వేదంపైన వ్యాఖ్యానాలు 30
4. వేదాధ్యయనానికి అర్హత 34

వివరణలు 40

రెండవ అధ్యాయం

**వేదవాఙ్మయంలో విషయం**

1. వ్యాఖ్యాన పద్ధతులు 43
2. తర్క సహాయంతో వ్యాఖ్యానించగల స్వాతంత్ర్యం 50
3. వేదం ఒక సంవాదశీల విశ్వాసం 54
4. వేదం పట్ల కొన్ని ప్రాచీన దృక్పథాలు 57
5. సంగ్రహం 81

వివరణలు 92

మూడవ అధ్యాయం

**వేద సారాంశం, సమగ్రత**

1. వేదాలను సమన్వయించుకోవడం 102
2. వేదాలూ, అనుభవం వల్ల సమకూడే జ్ఞానమూ 108
3. యజ్ఞం 110
4. వేదార్థ సంగ్రహం 121

వివరణలు 124

ముఖచిత్రం గురించి ఒకమాట 129

వేదార్థ మీమాంస గురించి : *వాడ్రేవు చినవీరభద్రుడు* 130

## వివరణలు

1. ఎ.ఎ. మాక్డొనల్, 'ఎ ప్రాక్టికల్ సాంస్క్రిట్ డిక్షనరి'
2. పై పుస్తకం.
3. ఉపాసన అంటే ఏ విషయాన్ని ధ్యానిస్తున్నామో దానిమీదనే మనస్సు స్థిరంగా నిలపడం. 'ధ్యేయ వస్తూని చిత్తస్య స్థిరీకరణమ్'
4. దివ్య లేదా ఆరాధనీయమైన వేదమని అర్థం. వేదం విద్ అనే ధాతువునుంచి పుట్టింది. విద్ జ్ఞానే. అంటే దేన్నుంచి జ్ఞానం లభిస్తుందో అది అని. శ్రుతి అనేది శ్రు అనే ధాతువు నుంచి పుట్టింది శ్రు శ్రవణే. దేన్నుంచి జ్ఞానం వినబడుతుందో అదని అర్థం. శ్రీ అరవిందుల దృష్టిలో వేదం దివ్యజ్ఞానానికీ, దివ్యారాధనకీ, దివ్యకర్మకీ సంబంధించిన శాస్త్రం. ఋగ్వేదంలో పదోమండలంలో 71వ సూక్తాన్ని పరిచయం చేస్తూ సాయణులు 'అనేన సూక్తేన ఋషిః పరమపురుషార్థ సాధనమ్ పరబ్రహ్మ జ్ఞానమ్ స్తుతవాన్' అన్నారు. (అంటే ఏ బ్రహ్మజ్ఞానం ద్వారా పరమపురుషుడు ప్రాప్తిస్తాడో ఆ జ్ఞానాన్ని ఈ సూక్తంద్వారా ఋషి కీర్తించాడని అర్థం) ఈ అర్థాన్ని వివరించడానికి సాయణుడు బృహద్దేవతను కూడా ఉదహరించాడు.
5. 'వేదత్రయీ పరానందా తత్వార్థజ్ఞానసంయుతా' వరాహపురాణంలో గీతామాహాత్మ్యం నుండి.
6. 'హిందూయిజం అండ్ బుద్ధిజం', పుట 5.
7. దానిపైన నా తెలుగు 'వ్యాఖ్యానం' 1941లో ప్రచురించబడింది.
8. 1981 సెప్టెంబరు 3న పూనాలో బండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో నేను గీతపైన ప్రసంగించాను. గుంటూరులో 1988 జనవరి 18, 19 తేదీల్లో ఐసిపిఆర్ జాతీయ ప్రసంగాలు చేశాను. ఇటలీలో బొలోనా యూనివర్సిటీలో 1992 సెప్టెంబరు 19న జరిగిన గోష్ఠిలో ఒక పత్రం చదివాను.
9. దానిపైన నా తెలుగు 'వివరణ' 1946లో ప్రచురించబడింది.
10. నేను రాసిన 'రివలేషన్ అండ్ రీజన్ ఇన్ అద్వైత వేదాంత' భారతదేశంలోనూ, అమెరికాలోనూ 1959లో ప్రచురించబడింది. తిరిగి 1974లో భారతదేశంలో పునర్ముద్రణ పొందింది.

11. 'ద రెల్మ్ ఆఫ్ బిట్విన్', సిమ్లా 1973 గ్రంథంలో 3వ అధ్యాయం 'రెలిజియస్ ఏక్షన్' ప్రకారం.

12. దిక్కుల్ని మోసే ఏనుగుల్లాంటి పండితులని అర్థం. అంటే ఈ భూభారాన్ని మోస్తూ భూమిని రక్షిస్తున్న ఆ పురాణ దిగ్గజాలతో సమానమైన గాంభీర్యం కలిగిన పాండిత్యం కలిగినవారని దానర్థం. మనుషుల్లో సింహంలాంటివాడు అంటామే అలాంటి ప్రయోగమన్న మాట.

13. వేదార్థ సంగ్రహానికి వ్యాఖ్యానం రాసిన సుదర్శనసూరి చెప్పినదాని ప్రకారం ఆచార్యులు ఆ ప్రసంగాన్ని తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఎదురుగా ప్రసంగించారు. 'శ్రీభాష్యకృదుపన్యస్తో యః శ్రీశైల పతే పురః వేదార్థ సంగ్రహస్యాస్య..'

14. 'హెర్మన్యూటిక్స్' అంటే ఏదైనా శాస్త్ర సాహిత్యగ్రంథానికి చేసే వ్యాఖ్యానం, 'ద కన్సయిజ్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరి', 8వ ఎడిషన్, 1990.

మొదటి అధ్యాయం

# వేదవాఙ్మయాన్ని అర్థం చేసుకోవలసిన పద్ధతి

## I

## వేదం స్వభావం, అందులో ఉన్న విషయం

వేదాల్ని పరిరక్షించాలనీ, వేదాధ్యయనాన్ని ప్రోత్సహించాలనీ ఈ మధ్యగత కొంతకాలంగా కొందరు కృషి చేస్తున్నారు. వాళ్ళల్లో మతాన్ని రక్షించాలనుకునేవాళ్లూ ఉన్నారు. మతాలతో సంబంధంలేకుండా ప్రజలశ్రేయస్సు కోరుకునేవాళ్లూ ఉన్నారు. వేదాధ్యయనం పెంపొందాలనీ, బాగా వ్యాప్తి చెందాలనీ వాళ్లు గట్టిగా మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా మనం కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి, వాటికి జవాబు చెప్పుకోవాలి. వేదాలంటే ఏమిటి? వాటి ప్రత్యేకత, ప్రాముఖ్యం ఏమిటి? వేదాల్ని ఎలా పరిరక్షించుకోవాలి, ఆ సంప్రదాయాన్ని ఎలా కొనసాగించుకోవాలి? అసలు వేదాల్లో చెప్పబడ్డదానికీ ప్రస్తుత ప్రపంచానికీ సంబంధమేమిటిలాంటి కొన్ని ప్రశ్నలు.

వేదాల్ని నిర్వచించవలసివచ్చినప్పుడు కాత్యాయనుడూ తదితరులూ వేదాల్ని మంత్రబ్రాహ్మణసముదాయం[1]*గా పేర్కొన్నారు. వేదాలన్నిటికీ భాష్యంరాసిన మహానుభావుడు సాయణుడు** వేదాలకు కనీసం మూడు నిర్వచనాలిచ్చాడు: వేదమంటే

---

* సాధారణంగా పూర్వమీమాంస మంత్రాలు గురించి ఇలా అంటుంది: 'యజ్ఞయాగాదులు నిర్వహించడానికి అవసరమైన పరిజ్ఞానాన్నిచ్చే పవిత్రవాక్యాలు మంత్రాలు. బ్రాహ్మణాలు విధిని సూచించే పవిత్రవాక్యాలు. అందుకు సహాయంగా పనికొచ్చే వాక్యాలు అర్థవాదాలు.' (కృష్ణయజ్వ, మీమాంస పరిభాష). అయితే ఈ దృక్పథాన్ని తక్కిన వేదవ్యాఖ్యాతలు అంగీకరించరు.

** మొత్తం వేదాలమీద ఇప్పుడు మనకు కేవలం సాయణభాష్యమొక్కటే లభ్యమవుతూఉంది. అయితే దాన్ని రాశిపరంగా చూసినా, అందులో కనవచ్చే వ్యాఖ్యానవైరుధ్యాలనిబట్టి చూసినా ఆ మొత్తం వ్యాఖ్యానమంతా ఒక్కరే రాశారన్న నమ్మకం కుదరడం కష్టం. ఒక్క వ్యాసుడే అన్ని పురాణాలు ఉప పురాణాలు ఎలా రాసి ఉండడో, అలాగే ఒక్క సాయణుడే మొత్తం వేదభాష్యం రాసి ఉండడు. బహుశా వివిధ సంహితలకీ బ్రాహ్మణాలకీ భాష్యాలు రాసిన పండితబృందానికి సాయణుడు అధిపతిగా ఉండిఉండవచ్చు.

మంత్రబ్రాహ్మణాలతో కూడుకున్న శబ్దరాశి అని తన ఋగ్భాష్యభూమికలో చెప్పాడు. మీమాంసకులు చాలామందీ, ఆపస్తంబుడూ, మాండూక్యోపనిషత్తుకి భాష్యం రాస్తున్నప్పుడు శంకరుడూ ఈ నిర్వచనాన్ని అంగీకరించినట్టే కనబడ్డారు.

అయితే, యాస్కుడూ[2], పాణినీ[3] నిగమాల(ఛందస్సు) నుండి బ్రాహ్మణాలని వేరుచేసి చూపించినందువల్ల, మంత్రాలతో కూడుకున్న సంహితలను మాత్రమే స్వామి దయానంద సరస్వతి వేదంగా గుర్తించాడు. శ్రీ అరవిందులూ, టి.వి.కపాలిశాస్త్రి కూడా కేవలం సంహితల్ని మాత్రమే వేదాలుగా గుర్తించాలని అభిప్రాయపడ్డారు. అయితే, మహామీమాంసకులు ప్రభాకరులూ, సాయణులూ కూడా మంత్రమంటే ఏమిటో నిజమైన అర్థం చెప్పనేలేదు. వేదవిదులు వేటిని మంత్రాలుగా భావిస్తారో అవి మాత్రమే మంత్రాలని చెప్తూ సాయణుడు వేదాల్లో మంత్రభాగం కానివాటినే బ్రాహ్మణాలన్నాడు. మధుసూదనసరస్వతి తన ప్రస్థానభేదంలో వేదాలంటే మంత్రబ్రాహ్మణ సముదాయమంతానని నిర్వచించాడు. ఆయన చెప్పినదాని ప్రకారం మంత్రాలు యజ్ఞయాగాదులకు సంబంధించిన దేవతలగురించి వివరించేవి.

బ్రాహ్మణాల్లో మూడు భాగాలున్నాయి. ఒకటి, విధి (ఆదేశాలు). రెండవది, అర్థవాదం (వివరణాత్మకవాక్యాలు). మూడవది, విధీ, అర్థవాదమూ కాని భాగం. విధిలోనూ, అర్థవాదంలోనూ చేరకపోయినా, వేదాల్లో చాలా ముఖ్యమైనభాగంగా చెప్పదగ్గ వేదాంతసూత్రాలు ఈ మూడవతరహాకి చెందినవి.

ఋగ్వేదంపై తన భాష్యంలో సాయణుడు వేదానికి మరొక నిర్వచనం కూడా ఇచ్చాడు. దేనిద్వారా మానవుడి అలౌకికప్రయోజనం సిద్ధిస్తుందో ఆ ఉపాయాన్ని తెలియచేసేదిగా వేదాన్ని ఆయన పేర్కొన్నాడు[4]. తైత్తిరీయోపనిషత్తుకి ఆయన రాసిన భాష్యంలో కూడా దాదాపు ఇటువంటి నిర్వచనమే కనిపిస్తుంది. వేదమంటే ఇష్టప్రాప్తికలిగించే, అనిష్టాన్ని తొలగించే అలౌకిక ఉపాయాన్ని సాధించేదన్నాడాయన[5].

ఉదాహరణకి, పురుషులకి స్త్రీస్పర్శా, చందనచర్చా ఆహ్లాదాన్ని కలిగిస్తాయనేది మనుషులకి అనుభవంలో తెలిసిన విషయమే. వేదం ప్రయోజనం అటువంటి జ్ఞానం అందించడం కాదు. కాలంజఫలంగాని, లేదా విషపూరితమైన బాణంతో చంపబడ్డ జంతువు మాంసాన్ని తినడంగాని పాపపూరితమంటారు. ఆ మాటల్లోని సత్యం మనం అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగేది కాదు. అలాగే జ్యోతిష్టోమాది క్రతువులు చేసినందువల్ల స్వర్గం ప్రాప్తిస్తుందనే మాట కూడా అనుభవం ద్వారా నిరూపించ గలిగేదికాదు. అటువంటి జ్ఞానాన్ని ఏది అందిస్తుందో దాన్నే వేదమన్నాడు సాయణుడు.